నిధులు ఇచ్చి.. బాధ్యత మరచి..

- అభివృద్ధికి నోచుకోని ఒబ్లిస్క్ టవర్
- రూ.కోట్ల వ్యయం.. నిర్వహణ శూన్యం
- పర్యాటకుల ఆదరణ కరువైన గొప్ప నిర్మాణం


టవర్ ఎదురుగా అసంపూర్తిగా వదిలేసిన వాటర్ ఫౌంటైన్ల నిర్మాణాలు


గిరియాంపేటలో ఒబ్లిస్క్ టవర్

యానాం: కోట్లాది రూపాయల కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) నిధులతో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో గిరియాంపేటలో నిర్మించిన యానాం ఒబ్లిస్క్ టవర్ సరైన నిర్వహణ లేక పర్యాటకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో వుండే ఈఫిల్ టవర్ నమూనాతో రిలయన్స్ ఇండస్ట్రీస్ దీనిని నిర్మించింది. 2015లో దీనిని ప్రారంభించినా మౌలిక వసతులు లేకపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులను ఆకట్టుకోలేపోయింది.

రూ.కోట్ల వ్యయంతో నిర్మాణం

రిలయన్స్, పర్యాటకశాఖ నిధులు వాటా రూ.17.21 కోట్లతో సుమారు 18 ఎకరాల్లో ఈ నిర్మాణం చేపట్టారు. ప్రధానమైన ఒబ్లిస్క్ టవర్ 9,125 టన్నుల బరువుతో 333 (101.6మీటర్లు) అడుగుల ఎత్తులో దీనిని నిర్మించారు. ఇప్పటి వరకు పర్యాటకులుకు కావాలసిన మౌలిక వసతులు కల్పించలేదనే విమర్శలు వస్తున్నాయి. ఈ టవర్ యానాం పట్టణానికి సుమారు 10 కిలో మీటర్లు దూరంలో నిర్మించారు. ఇంత దూరం వెళ్లిన పర్యాటకులుకు అక్కడ మంచినీరు కూడా లేని పరిస్థితి ఉందని పర్యాటకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


టవర్ వద్ద లోపల పనిచేయని లిఫ్ట్


అభివృద్ధికి నోచుకోకుండా వదిలేసిన టవర్ ఎదురుగా ఉన్న ప్రదేశం

అభివృద్ధికి నోచుకోని పరిసరాలు

టవర్ చుట్టూ సుమారు 17 ఎకరాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సి వుంది. కాని ఇప్పటివరకు ఎదురుగా ముళ్లకంపలు తప్పించి ఎటువంటి నిర్మాణాలు చేపట్టలేదు. దీనికి తోడు గత ఏడాది టవర్ ఎదుట చేపట్టిన వాటర్ ఫౌంటైన్ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. విద్యుత్‌లైట్లు వెలగక చుట్టూ చీకట్లు కమ్ముకుంటున్నాయి.

పని చేయని లిఫ్ట్..

పర్యాటకులకు నిలువ నీడలేదు. తుప్పు పడుతున్న ఇనుప ఊచలు. టవర్‌కు పైభాగానికి సుమారు వంద మీటర్ల ఎత్తుకు వెళ్లడానికి లిఫ్ట్ ఏర్పాటు చేశారు. రెండేళ్లుగా ఇది నిరుపయోగంగా ఉంది. దీంతో మెట్లు ఎక్కి దిగలేక పర్యాటకులు అవస్థలు పడుతున్నారు. అలాగే కూర్చోడానికి బెంచీలు లేక, మరుగుదొడ్ల సదుపాయం లేక, వాటి నిర్వహణ సరిగా లేక మహిళలు ఇబ్బంది పడుతున్నారు.

సదుపాయాలు కల్పించాలి

ఒబ్లిస్క్ టవర్ వద్ద మౌలిక వసతులు కల్పించాలి. పర్యాటకులకు ఆహ్లాదాన్ని కలిగించేలా పరిసరాలు తీర్చిదిద్దాలి. పట్టణ చివరిలో నిర్మాణం ఉండడంతో కోట్లాది రూపాయల నిధులు వృథా అయ్యాయి – సబ్బతి శ్రీనివాస్, యానాం

క్లుప్తంగా

నేడు వెంకటరెడ్డి జయంతి


దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహం

అమలాపురం టౌన్: శెట్టిబలిజ పితామహుడు, ఆ సామాజిక వర్గ సంఘం వ్యవస్థాపకుడు దొమ్మేటి వెంకటరెడ్డి 172వ జయంతి ఉత్సవాన్ని ఆదివారం నిర్వహించేందుకు నియోజకవర్గంలోని సామాజిక వర్గం పెద్దలు, నాయకులు ఏర్పాట్లు చేశారు. అమలాపురం హైస్కూల్ సెంటర్‌లో ఉదయం 9 గంటలకు వెంకటరెడ్డి జయంతి నిర్వహిస్తున్నట్లు కోనసీమ శెట్టిబలిజ కార్తిక వన సమారాధన కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది. హైస్కూలు సెంటర్‌లో నిర్వహించే ఈ కార్యక్రమానికి కోనసీమలోని సామాజిక వర్గీయులు తరలి రావాలని కమిటీ పిలుపునిచ్చింది. వెంకటరెడ్డి స్వగ్రామైన అల్లవరం మండలం బోడసకుర్రులో కూడా ఆయన జయంతి ఉత్సవాన్ని నిర్వహించేందుకు నియోజకవర్గ సంఘీయులు ఏర్పాట్లు చేశారు.

జలభద్రతతోనే భవిత సురక్షితం

సాక్షి, అమలాపురం: మానవాళి మనుగడకు నీరే ప్రాణాధారమని, జలభద్రతతోనే భవిత సురక్షితమని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు. నాబార్డ్, జిల్లా అధికారుల సంయుక్త ఆధ్వర్యాన కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన ప్రపంచ జల దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. భవిష్యత్తులో ఎదురయ్యే నీటి యాజమాన్య సవాళ్ల గురించి ప్రస్తావించి, దీనికి అనుగుణంగా శాస్త్రవేత్తలు, అధికారులు, సంబంధిత సంస్థలు సంయుక్తంగా ప్రణాళికలు రచించుకుని ముందుకు సాగాలని అన్నారు. పెరుగుతున్న వాతావరణ మార్పుల వలన గోదావరి డెల్టా భూగర్భ జల వనరుల్లో పెరుగుతున్న సెలైనిటీ, ఇతర మార్పులను జాతీయ జల సంస్థ శాస్త్రవేత్త వై.శివప్రసాద్ క్షుణ్ణంగా వివరించారు. తీర ప్రాంతంలో మడ అడవుల పరిరక్షణ, ఉప్పు నీటి ప్రవాహాల ముప్పు తదితర అంశాలపై జిల్లా అటవీ అధికారి ఎంవీ ప్రసాదరావు చర్చించారు. నాబార్డ్ డీడీఎం వైఎస్ నాయుడు మాట్లాడుతూ, వ్యవసాయ, అనుబంధ రంగాల్లో ప్రాజెక్టులు, కాట్రేనికోన ప్రాంతంలో ఎండు చేపల తయారీకి సోలార్ డ్రయ్యర్ యూనిట్లను ప్రతిపాదించామని తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం కేశవవర్మ తదితరులు పాల్గొన్నారు.

నిండు శోకంతో ఇమామ్ అలీ వర్ధంతి


ఇమామ్ అలీ వర్ధంతి విశిష్టతను వివరిస్తున్న మత గురువు హైదర్ అలీ

అమలాపురం టౌన్: షియా ముస్లింల ఆరాధ్య దైవమైన దూత మహ్మద్ ప్రవక్త అల్లుడైన హజరత్ ఇమామ్ అలీ 1406వ వర్ధంతి స్థానిక 12వ వార్డు ముజాఫర్ సందులోని ఆస్థానే అబ్బాసియ పీర్ల పంజాలో శనివారం జరిగింది. షియా ముస్లింలు అలీ వర్ధంతిని భక్తి శ్రద్ధలతో నిండు శోకంతో నిర్వహించారు. మత గురువు మౌలానా హైదర్ అలీ సందేశంలో ఇమామ్ అలీ వర్ధంతి విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు సుదూర ప్రాంతాల నుంచి మహిళలు, వృద్ధులు, పిల్లలు తరలివచ్చి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. మసీదు అధ్యక్షుడు నిసార్ హుస్సేన్, కార్యదర్శి కర్రార్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. హైదర్ అలీ సందేశం అయ్యాక షియాలు ఉపవాస దీక్షలను విరమించి ప్రసాద వితరణ చేశారు.

సేవే లక్ష్యం కావాలి


లాస్య నందన కార్యక్రమాన్ని ప్రారంభించిన లయన్స్ ప్రతినిధులు

యానాం: స్థానిక పెద్దిరెడ్డి వినాయకరావు కాపు కల్యాణమండపంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో లాస్య నందన పేరుతో ఏడో వార్షిక డిస్ట్రిక్ట్ కన్వెన్షన్ ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని లయన్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధి విజయకుమార్‌రాజు, డిస్ట్రిక్ట్ గవర్నర్ ఈశ్వర్‌కుమార్, మంగాదేవి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ లయన్స్ సభ్యులు విద్య, వైద్యం తదితర రంగాల్లో సామాజిక సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు. అంతకు ముందు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎడ్ల అలేషా, పి. సుభాష్ బాబు, అంబటి సుధాకరరెడ్డి, మేకా శ్రీరామ్‌సురేష్, దామర్ల శ్రీకాంత్, పంకజాక్షన్, వేలూరి సూర్యనారాయణ, డీవీఎస్ రాజు పాల్గొన్నారు.

ధర్నాకు తరలిరండి

అల్లవరం: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాకు వేలాదిగా ఎస్సీ సామాజిక వర్గీయులు రావాలని బీఎస్పీ జిల్లా నాయకులు జిత్తుక సత్యనారాయణ శనివారం పిలుపునిచ్చారు. రాజకీయ ప్రయోజనాల కోసం మాల మాదిగలను విడగొడుతున్నారని సత్యనారాయణ తెలిపారు.

కలెక్టర్‌ను కలసిన డీఆర్‌డీఏ పీడీ


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలుపుతున్న పీడీ జయచంద్ర

అమలాపురం రూరల్: జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పీడీ టి.సాయినాథ్ జయచంద్ర శనివారం కలెక్టర్‌ను ఆర్.మహేష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మహిళా స్వయం సహాయక సంఘాల ప్రగతి గురించి చర్చించారు. కాకినాడ జిల్లాలో డ్వామాలో విధులు నిర్వహిస్తూ జయ చంద్ర కోనసీమ జిల్లాకు పీడీగా అదపు బాధ్యతలు చేపట్టారు.

డంప్ యార్డు ఏర్పాటు అడ్డగింత

యానాం: మున్సిపాలిటీ పరిధిలో చెత్తను దిగుమతి చేయడానికి వీలుగా గోపాల్‌నగర్‌లో డంపింగ్‌యార్డు ఏర్పాటును శనివారం ఆ గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోపాల్‌నగర్ పవర్‌గ్రిడ్ వద్ద ఉన్న స్థలంలో డంపింగ్ యార్డు పెట్టడం వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడతారని అనారోగ్య సమస్యలు వస్తాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం గోపాల్‌నగర్ వద్ద డంప్ యార్డు నిర్వహణను ప్రభుత్వం విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో సీఐ షణ్ముగం తదితరులు ఆందోళనకారులతో మాట్లాడారు. ఆదివారం నుంచి చెత్తను వేయనిచ్చేది లేదని స్థానికులు ఆయనకు స్పష్టం చేశారు. అనంతరం ఆర్ఏఓ మునిస్వామి స్థానికులు వినతిపత్రం అందజేశారు.

ఆశా వర్కర్లను కార్మికులుగా గుర్తించాలి


జిల్లా నోడల్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

ముమ్మిడివరం: తమను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించి, కనీస సౌకర్యాలు కల్పించాలని కోనసీమ ఆశా వర్కర్ల యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా ఆశా నోడల్ అధికారి పీబీఎల్ కుమారికి యూనియన్ నాయకులు శనివారం వినతిపత్రం అందజేశారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశా కార్యకర్తలుగా గుర్తించాలని, దేశమంతా ఒకే రకమైన పని పరిస్థితులు, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించి, పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోవిడ్ కాలంలో ప్రాణాలకు తెగించి పని చేసిన ఆశా కార్యకర్తల సేవలను ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించడంతో తమ డిమాండ్లను గతంలో భారత ప్రభుత్వం అంగీకరించిందన్నారు. అయితే ఇప్పటి వరకూ అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు బి.ఎస్తేరురాణి, ఈశ్వరి పాల్గొన్నారు.

వర్సిటీ టాపర్‌గా హేమా విజిత



హేమా విజితకు ప్రశంసా పత్రం, స్వర్ణ పతకాన్ని అందిస్తున్న వీసీ తదితరులు

అమలాపురం రూరల్: వైద్యశాస్త్రం పీజీ పరీక్షల్లో మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ కరాటం హేమ విజిత విశాఖపట్నం గీతం యూనివర్సిటీ టాపర్‌గా నిలిచిందని ఆమె తండ్రి, అమలాపురం వెంకటేశ్వర డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కేవీఆర్ఎన్ నరసింహారావు శనివారం తెలిపారు. యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో గోల్డ్ మెడల్, ప్రశంస పత్రంతో వర్సిటీ వీసీ అభినందించారు. హేమ విజితను కళాశాల ప్రిన్సిపాల్ కేవీఆర్ మనోహర్, ఏవో కరాటం ప్రవీణ్, అధ్యాపకులు అభినందించారు.

నేటి నుంచి సీపీఐ రాజకీయ ప్రచార జాతా


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రభాకర్

అమలాపురం టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై క్షేత్ర స్థాయి ప్రచారానికి ఆదివారం నుంచి ఏప్రిల్ 14వ తేదీ వరకూ ప్రచార జాతా నిర్వహించనున్నట్టు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ వెల్లడించారు. స్థానిక ఎస్‌టీయూ భవన్‌లో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.రామకృష్ణ అధ్యక్షతన శనివారం జరిగిన జిల్లా పార్టీ సమావేశంలో ప్రభాకర్ మాట్లాడారు. పార్టీ జాతీయ సమితి పిలుపు మేరకు చేపట్టే ఈ ప్రచారాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ వర్ధంతి రోజైన ఆదివారం నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి (ఏప్రిల్ 14) వరకూ జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటు అనుకూల, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కూటమి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఈ నిరసనతో కూడిన ప్రచార బాట ఉంటుందని ఆయన తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయలేదని ధ్వజమెత్తారు. ప్రచార జాతాలో జిల్లా సమగ్ర అభివృద్ధికి పార్టీ పరంగా ఓ కార్యాచరణ రూపొందించాలని నాయకులు తీర్మానించారు. ప్రభుత్వం ఇస్తానన్న ఇళ్ల స్థలాల కోసం పార్టీ తరఫున పెద్ద ఎత్తున ఆందోళన చేయాలని పార్టీ నాయకులు స్పష్టం చేశారు.

విజ్ఞాన యాత్రలో విద్యార్థులు


సాంకేతిక పరిశోధనలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

ముమ్మిడివరం: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన విజ్ఞాన యాత్రలో భాగంగా శనివారం స్థానిక విద్యార్థులు తిరుపతిలోని ప్రముఖ శాస్త్ర, సాంకేతిక, చారిత్రాత్మక ప్రదేశాలను సందర్శించారు. జిల్లాకు చెందిన 116 మంది విద్యార్థులు, 20 మంది గైడ్ ఉపాధ్యాయులు విజ్ఞాన యాత్రకు వెళ్లారు. తిరుపతి ఐఐటీ క్యాంపస్‌ను పరిశీలించి అక్కడి విద్యా విధానాన్ని పరిశీలించారు. ఐఐటీ విద్యార్థులతో ముఖాముఖీ అయ్యి పరస్పరం అనుభవాలను పంచుకున్నారు. ప్రొఫెసర్ మహేష్ కుమార్ ప్రస్తుత విద్యా వ్యవస్థలో సాంకేతిక ప్రాముఖ్యత అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. అనంతరం శ్రీవెంకటేశ్వర జూలాజికల్ పార్క్‌లో జంతువులను, పక్షులను పరిశీలించి వివిధ జీవరాశుల స్వభావం, ఆహార అలవాట్లు జీవనశైలిపై అవగాహన కలిగించారు. అలాగే తిరుపతి రీజనల్ సైన్స్ సెంటర్‌ను సందర్శించి నిత్య జీవిత సమస్యలకు శాస్త్రం, సాంకేతికత ఏ మేరకు ఉపయోగ పడుతుందనే అంశంపై అవగాహన కల్పించారు. ప్రదర్శనలో ప్లానిటోరియం షో, స్పేస్ ఎక్స్‌పో షోలు విద్యార్థులను ఆకట్టుకున్నాయని జిల్లా విద్యాశాఖాధికారి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

చెస్‌లో సాత్విక్ ప్రతిభ


సాత్విక్‌ను అభినందిస్తున్న చైర్మన్ కృష్ణ సతీష్, ప్రిన్సిపాల్ రామారావు తదితరులు

అమలాపురం రూరల్: భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో డిప్లొమా చదువుతున్న ద్రాక్షారాపు సాత్విక్ రామచంద్రపురం వీఎస్ఎం కళాశాలలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి చెస్ పోటీల్లో విజేతగా నిలిచాడని కళాశాల పీడీలు కె.రవి సుధీర్, మురళి తెలిపారు. ఈ సందర్భంగా సాత్విక్‌ను బీవీసీ కళాశాలల చైర్మన్ బోనం కృష్ణ సతీష్ శనివారం అభినందించారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి


పాలకవర్గ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సునీత తదితరులు

తాళ్లరేవు: ప్రజా సమస్యలను పరిష్కరించాలని పలువురు సభ్యులు అధికారులను కోరారు. శనివారం మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఎంపీపీ రాయుడు సునీత అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలువురు సభ్యులు వారి ప్రాంతాల్లోని సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా తాగు, సాగునీరు పూర్తిస్థాయిలో అందడం లేదని, పలు చోట్ల ఉపాధి కూలీలకు పనులు చెప్పడం లేదని, జల్ జీవన్ మిషన్ ద్వారా జరుగుతున్న పనులను అసంపూర్తిగా వదిలేసారని, రీసర్వే వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని పలువురు సభ్యులు వివరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఎంపీపీ సునీత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పలు శాఖల ద్వారా చేపడుతున్న పథకాలను అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.సత్యనారాయణ, తహసీల్దార్ పి.త్రినాథరావు, వైస్ ఎంపీపీలు డి.నాగేంద్రప్రసాద్, కె.లలిత, సర్పంచ్‌లు పెయ్యల మంగేష్, ఎస్.శంకరుడు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. తొలుత కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాలకవర్గ శిలాఫలకాన్ని ఎంపీపీ సునీత ప్రారంభించారు.

స్టడీ లీవ్ ఖాళీలను క్లియర్ వేకెన్సీలుగా చూపొద్దు

- ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు నకులరాజు

అమలాపురం రూరల్: పదోన్నతుల కోసం అదనపు విద్యార్హతలు సాధించేందుకు స్టడీ లీవ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల పోస్టులను బదిలీల నియంత్రణ చట్టంలో క్లియర్ వేకెన్సీలుగా చూపడాన్ని ఏపీ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం ఖండించింది. సంఘ జిల్లా అధ్యక్షుడు బత్తుల నకులరాజు అధ్యక్షతన అమలాపురం నడిపూడి దాబా గార్డెన్‌లో ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం శనివారం నిర్వహించారు. ప్రస్తుతం పని చేస్తున్న ఖాళీలను క్లియర్‌గా చూపితే ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతారని, స్టడీ లీవ్ అనంతరం ఎక్కడికి వెళ్లాలో తెలియని పరిస్థితి తలెత్తుతుందని సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. గతంలో వలే స్టడీలకి వెళ్లిన ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులు పనిచేస్తున్న పోస్టులను ఖాళీలుగా మాత్రమే చూపించాలని, అవసరమైతే ఆ పోస్టులలో ఎంటీఎస్ టీచర్లను నియమించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గోసంగి బంగార్రాజు, ఆర్థిక కార్యదర్శి సాధనాల సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల రమేష్ బాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు గెడ్డం ప్రదీప్, మంగం సుధాకర్, మండల అధ్యక్షుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు పరామర్శ


సుశీల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ కౌన్సిలర్లు

అమలాపురం టౌన్: మాతృ వియోగంతో బాధపడుతున్న మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజును కౌన్సిలర్లు శనివారం పరామర్శించారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గం మేడి కొండూరు గ్రామంలోని కమిషనర్ ఇంటికి పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్లు వెళ్లి ఆయనను పరామర్శించి సానుభూతి తెలిపారు. కమిషనర్ తల్లి సుశీల చిత్ర పటానికి వారు నివాళులర్పించారు. కౌన్సిలర్లు మట్టపర్తి నాగేంద్ర, సంసాని బులినాని, యేడిద శ్రీను, దొమ్మేటి రాము, నాగారపు వెంకటేశ్వరరావు, కొల్లాటి దుర్గాబాయి, మహిళా కౌన్సిలర్ల కుటుంబీకులు పిండి రాజా, దొంగ చిన్నా తదితరులు కమిషనర్ రాజును పరామర్శించిన వారిలో ఉన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందులో పాల్గొన్న బిస్మిల్లా యూత్ సభ్యులు, మతపెద్దలు

యానాం: రంజాన్ పవిత్ర ఉపవాస దీక్షలను పురస్కరించుకుని నియోజకవర్గ పరిధిలో ముస్లింలకు శనివారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఇఫ్తార్ విందు ఇచ్చారు. స్థానిక జామియా మసీదు, మసీద్ ఏ కూబా మసీదుల్లో ఉపవాస దీక్ష ప్రార్థనల అనంతరం బిస్మిల్లా యూత్ నిర్వహణలో జరిగిన ఇఫ్తార్ విందుకు పలువురు ముస్లింలు హాజరయ్యారు. ముస్లింల అభివృద్ధికి వారి సంక్షేమానికి తాను కట్టుబడి ఉన్నానని, ఇప్పటికే ఎమ్మెల్యే నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టానని, అసెంబ్లీ సమావేశాల దృష్ట్యా పుదుచ్చేరి నుంచి ఎమ్మెల్యే అశోక్ పంపిన సందేశంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో బిస్మిల్లా యూత్ సభ్యులు కరీమ్, ఖాసిం, ఉమర్, ముస్లిం పెద్దలు తాజుద్దీన్ బాషా, ఎస్‌కెఎమ్ జిలానీ, ఎండి అన్సారీ, పీర్ మహ్మద్, సుభానీ, కరీమ్, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల విలీనానికి అవకాశం లేదు

యానాం: యానాంలో అడ్మిషన్లు తక్కువగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలను రేషనలైజేషన్ పేరు మీద విలీనం చేసే అవకాశం లేదని మంత్రి నమశ్శివాయం పుదుచ్చేరి అసెంబ్లీలో పేర్కొన్నారను. శనివారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ పాఠశాలల విలీనంపై వస్తున్న వార్తల నేపథ్యంలో తాము ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని, కాని ఉపాధ్యాయుల నుంచి నివేదికను కోరినట్లు తెలిపారు. పుదుచ్చేరి వ్యాప్తంగా రేషనలైజేషన్ చేపట్టడం వల్ల విద్యార్థులకు మాతృభాషలో బోధన కష్టమవుతుందని ఎమ్మెల్యే అశోక్ సభలో పేర్కొన్నారు. యానాంలో నిరుద్యోగ యువతకు గ్రూప్-బి, సి విభాగాల్లో ఉద్యోగ నియామకాల్లో వయోపరిమితిని పెంచాలని కోరారు. గెస్ట్ టీచర్ల సేవలను క్రమబద్ధీకరించాలని, అక్షయపాత్ర ద్వారా మధ్యాహ్న భోజన పథకాన్ని అందించాలని కోరారు.

అత్తింటి వారిపై అల్లుడి దాడి

భార్య, మరదలు, అత్త మామలకు గాయాలు

అమలాపురం టౌన్: పనికి వెళ్లకుండా ఇంట్లో ఖాళీగా కూర్చుంటున్నాడని, ఇలాగైతే వాయిదాల పద్ధతిలో తీసుకున్న మోటారు సైకిల్ బాకీ ఎప్పటికి తీరేనని భార్య మందలించిందని ఆమె భర్త వేముల ప్రసాద్ అత్తింటి వారిపై శనివారం దాడికి దిగాడు. స్థానిక ఉప్పరకాలనీలో జరిగిన ఈ దాడిలో ప్రసాద్ భార్య, అత్త మామలు, మరదలు గాయపడ్డారని పట్టణ ఎస్సై టి.శ్రీనివాస్ తెలిపారు. సెంట్రింగ్‌కు వాడే చెక్క బద్దతో ప్రసాద్ దాడి చేశాడని అత్తింటి వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. సీఐ పి.వీరబాబు ఈ మేరకు అత్తింటి వారిని విచారించారు. గాయపడ్డ ప్రసాద్ భార్య, అత్తమామలు, మరదలిని చికిత్స నిమిత్తం అమలాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు.

మెప్మా ఆర్పీలకు నగదు బహుమతి

అమలాపురం టౌన్: ఉత్తమ సేవలందించి జిల్లా మొదటి స్థానంలో నిలిచిన మెప్మా రిసోర్స్ పర్సన్ విత్తనాల వెంకట పద్మజకు రూ.2500 నగదు బహుమతి అందించారు. అలాగే రామచంద్రపురం, మండపేట మున్సిపాలిటీల మెప్మా విభాగాల్లో పని చేస్తున్న ఇద్దరి రిసోర్స్‌పర్సన్లను రెండు, మూడు స్థానాలకు ఎంపిక చేసి నగదు బహుమతులు అందజేశారు. కాకినాడలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మెప్మా పీడీ ప్రియంవద చేతుల మీదుగా వారు బహుమతులు అందుకున్నారు.

సంక్షిప్తంగా...

సబ్ జైలు నుంచి నిందితుడి పరారీ

యానాం: స్థానిక సబ్ జైలు నుంచి రిమాండ్ ఖైదీ పరారయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి స్థానిక గొల్లల వీధిలోని ఓ వృద్ధురాలిని బెదిరించి ఆమె బంగారు గాజులను తస్కరించిన కేసులో కనకాలపేటకు చెందిన కనకాల వెంకటేశ్వర్లును పోలీసులు శనివారం అదుపులోకి తీసుకుని యానాం సబ్ కోర్టులో హాజరుపరిచారు. అతడికి 7 రోజులు రిమాండ్ విధించడంతో శనివారం ఉదయం 11 గంటలకు యానాం సబ్‌జైలుకు తరలించారు. సబ్‌జైలులో పెయింటింగ్స్, నిర్వహణ పనులు చేస్తుండడంతో గోడకు నిచ్చెన వేసి ఉంచారు. అదే అదనుగా వెంకటేశ్వర్లు నిచ్చెన సాయంతో గోడ దూకి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న జైలు సిబ్బంది పోలీసులకు సమారం ఇవ్వగా సీఐ షణ్ముగం ఆధ్వర్యంలో నిందితుడిని గాలిస్తున్నారు. పలు కేసుల్లో అతడు నిందితుడిగా ఉన్నాడని, హైదరాబాదులో ఉంటున్న అతడు ఇటీవలే ఓ కేసు విచారణకు యానాం వచ్చి, మళ్లీ దొంగతనానికి పాల్పడినట్టు ఈ విధంగా పరారయ్యాడు.

చెత్త నుంచి సంపద కేంద్రం పరిశీలన


షెడ్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజ్‌కుమార్

ఉప్పలగుప్తం: మండలంలోని గోపవరం గ్రామంలో నూతనంగా నిర్మించి, ప్రారంభానికి సిద్ధం చేసిన చెత్త నుంచి సంపద కేంద్రాన్ని ఇన్‌చార్జి ఎంపీడీవో పీఆర్‌సీ రాజ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సంపద కేంద్రాన్ని త్వరగా వినియోగంలోకి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శులు సర్పంచ్ కుంచే బుల్లియ్య, డి.బాలబాలాజీ, పెట్టా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ రుణాలకు గడువు పెంపు

అమలాపురం రూరల్: బీసీ కార్పొరేషన్ ద్వారా 2024–25 సంవత్సరానికి సంబంధించి స్వయం ఉపాధి యూనిట్ల కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసేందుకు ఈనెల 25వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు జిల్లా బీసీ కార్పొషన్ అధికారి శ్రీనివాసరావు శనివారం తెలిపారు. జనరిక్ మెడికల్ షాపుల కోసం మేదర, కుమ్మరి, శాలివాహన, బీసీ కాపు, వైశ్య, రెడ్డి, కమ్మ, క్షత్రియ, బ్రాహ్మణ యూనిట్లు, గ్రూపు యూనిట్లకు ప్రభుత్వ సబ్సిడీతో కూడిన బ్యాంకు రుణాల కోసం తొలుత 8 నుండి 22వ తేదీ వరకు గడువు ఇచ్చినట్లు తెలిపారు. దరఖాస్తుదారుని వయసు 21 నుంచి 50 సంవత్సరాల వయో పరిమితిని 60 సంవత్సరాలకు పెంచినట్లు తెలిపారు. జిల్లాలో అర్హత కలిగిన సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు రుణాల కోసం వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేయాలన్నారు.

జ్యోతిసుధ సేవలు ప్రశంసనీయం

తాళ్లరేవు: బదిలీపై వెళ్తున్న పోలేకుర్రు గ్రామ పంచాయతీ కార్యదర్శి బోమిడి జ్యోతిసుధను పంచాయతీ కార్యవర్గం, నాయకులు శనివారం ఘనంగా సత్కరించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ వెంటపల్లి నూకరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు టిల్లపూడి నాగేశ్వరరావు, నీలపల్లి సర్పంచ్ చిట్టూరి నాగణి, పోలేకుర్రు మాజీ సర్పంచ్ దడాల బుజ్జిబాబు, నాయకులు నిమ్మకాయల మూర్తి, నల్లి బాలకృష్ణ, పెయ్యల రమేష్ తదితరులు హాజరై జ్యోతిసుధ, రామకృష్ణ దంపతులను సత్కరించారు. అనంతరం సర్పంచ్ నూకరాజు మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధికి జ్యోతిసుధ మూడేళ్ల పాటు అందించిన సేవలను కొనియాడారు.


జ్యోతిసుధ దంపతులను సత్కరించిన పోలేకుర్రు పంచాయతీ కార్యవర్గం, నాయకులు